సాక్షి కామారెడ్డి

శనివారం । 9 । నవంబర్ । 2024



ఆయిల్‌పామ్ సాగుపై..

రైతులు ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలని వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు.

- 9లో ▸



వేధిస్తున్న సర్వేయర్ల కొరత

జిల్లాలో సర్వేయర్ల కొరత ఉండటంతో భూ సమస్యలు పరిష్కారం కాక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం

35.5 /14.5

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

సెట్విన్‌లో స్వయం ఉపాధి శిక్షణ

కామారెడ్డి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ రంగ సెట్విన్ శిక్షణ కేంద్రంలో డీసీఏ, పీజీడీసీఏ, టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, మగ్గం వర్క్, మెహందీ స్వయం ఉపాధి కోర్సులు ప్రారంభమైనట్లు సమన్వయకర్త మొయిజుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయివేట్ శిక్షణకు కంటే అతి తక్కువ రుసుంతో పాటు 50శాతం రాయితీతో సెట్విన్ ఉత్తమమైన శిక్షణ అందిస్తుందని పేర్కొన్నారు. వివరాల కోసం 7386180456, 7989159121 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

రైతులకు ఇబ్బందులు రాకుండా చూడాలి



నస్రుల్లాబాద్: కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు రాకుండా చూడాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. మండలంలోని బొమ్మన్‌దేవ్‌పల్లి, అంకోల్ క్యాంప్, దుర్కిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె శుక్రవారం పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో మేచర్ రాగానే తూకం వేయాలని, రైస్ మిల్లుల్లో తరుగు తీయకూడదన్నారు. తహసీల్దార్ బావయ్య, ఆర్ఐ అంజు, మాజీ సర్పంచ్ అన్నం సత్యనారాయణ పాల్గొన్నారు.

తెలుగులో 'విద్యుత్' సమాచారం

కామారెడ్డి అర్బన్: వినియోగదారులకు అర్థమయ్యే విధంగా ఇకపై విద్యుత్‌కు సంబంధించిన అన్ని వివరాలు తెలుగులో అందించనున్నట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రావణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు సంబంధించి వ్యవసాయ అంచనాలు, సంక్షిప్త సందేశాలు(ఎస్ఎంఎస్‌లు) తెలుగులోనే ఉంటాయన్నారు. కొత్త లైన్ల ఏర్పాటు, ఇతర విద్యుత్ పనుల్లో రైతులు ఎలాంటి సామగ్రి కొనుగోలు చేయవద్దని, అలాగే పని చేయవద్దన్నారు. తమ ఏజెన్సీలే అన్ని పనులు చేస్తాయని పేర్కొన్నారు. ఆటో స్టార్టర్లు తొలగించుకోవాలని, లో వోల్టేజీ సమస్య రాకుండా వ్యవసాయ మోటార్లకు కెపాసిటర్లు బిగించుకోవాలని సూచించారు. అధికారుల పొలంబాటలో దృష్టికి వచ్చిన అన్ని విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ట్రాన్స్‌ఫార్మల వద్ద విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా గద్దెల ఎత్తు పెంచుతామన్నారు. విద్యుత్‌కు సంబంధించి ఇబ్బందులు ఉంటే 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.


పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లించాలి

కామారెడ్డి టౌన్: పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లింపు తేదీలను తెలంగాణ ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు వెల్లడించినట్లు డీఈవో రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఎలాంటి ఆలస్య రుసుం లేకుండా ఈ నెల 18 వరకు ఫీజు చెల్లించే అవకాశం ఉందన్నారు. రూ.50 అపరాధ రుసుంతో డిసెంబర్ 2 వరకు, రూ.200 రుసుంతో డిసెంబర్ 12 వరకు, రూ.500 ఆలస్య రుసుంతో డిసెంబర్ 21 వరకు చెల్లించవచ్చని ఆయన వివరించారు.

ఏసీబీకి చిక్కిన వర్ని ఎస్సై



వర్ని: స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు రూ. 20 వేలు లంచం తీసుకుంటుండగా వర్ని ఎస్సై కృష్ణ కుమార్‌ను ఏసీబీ అధికారులు శుక్రవారం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వర్ని మండలంలోని కోటయ్య క్యాంపు గ్రామానికి చెందిన నాగరాజుపై నాలుగు రోజుల క్రితం మండల కేంద్రంలో జరిగిన ఓ గొడవలో కేసు నమోదు అయ్యింది. ఆ కేసులో స్టేషన్ బెయిల్ ఇవ్వటానికి ఎస్సై కృష్ణ కుమార్ రూ.లక్ష డిమాండ్ చేశాడు. ఆఖరుకు రూ. 20 వేలకు ఒప్పుకున్నాడు. లంచం తీసుకుంటుండటంతో పాటు ఫోన్లో తనను బూతులు తిట్టాడని మనస్తాపం చెందిన నాగరాజు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ డీఎస్పీ శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో బాధితుడి నుండి ఎస్సై డబ్బులు తీసుకుంటుండగా పట్టుకొని కేసు నమోదు చేశారు. రూ. 20 వేల నగదును సీజ్ చేసి ఎస్సైపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఏసీబీ సీఐ వేణు కుమార్, శ్రీనివాస్, నగేష్ ఈ దాడిలో పాల్గొన్నారు.



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుటుంబ సర్వేలో మొదటి దశ హౌస్ లిస్టింగ్ ప్రక్రియ దాదాపు పూర్తయింది. జిల్లా వ్యాప్తంగా 2,97,300 కుటుంబాలను అధికారులు గుర్తించారు. ఇక నుంచి సర్వే బృందాలు కుటుంబ సభ్యుల సమగ్ర వివరాలు సేకరించనున్నారు.

రాజకీయ నేపథ్యంపైనా..

సర్వే వివరాల్లో కుటుంబ యజమాని, కుటుంబ సభ్యులు గానీ రాజకీయాల్లో పని చేసినట్లయితే వారి వివరాలు అడుగుతారు. ప్రజాప్రతినిధులుగా, కార్పొరేషన్ పదవులు పొందారా అని వివరాలు సేకరిస్తారు. కుటుంబ సభ్యులు వలస వెళ్తే ఆ వివరాలు నమోదు చేస్తారు. ఐదేళ్లలో తీసుకున్న రుణాలు, ఏ అవసరం నిమిత్తం తీసుకున్నారు, ఎక్కడ రుణం పొందారు అనే వివరాలు సేకరిస్తారు. వ్యవసాయ అనుబంధ కార్యకలాపాలలో పాల్గొంటే వివరాలు, కుటుంబానికి చెందిన పశుసంపద, స్థిరాస్తి వివరాలు, రేషన్‌కార్డు నంబరు, ఇంటి విస్తీర్ణం ఎంత, తాగునీటి వసరు, ఇంటికి విద్యుత్ సదుపాయం ఉందా తదితర వివరాలు సర్వేలో భాగంగా అధికారులు సేకరించనున్నారు.

ఇళ్ల లెక్క తేలింది!

- సర్వే తొలిదశలో హౌస్ లిస్టింగ్ ప్రక్రియ
- జిల్లాలో మొత్తం 2,97,300 కుటుంబాల గుర్తింపు
- ఇంకా పలుచోట్ల మిగిలిపోయిన గుర్తించాల్సిన ఇళ్లు
- ఇక ఇంటింటి సర్వేతో సమగ్ర వివరాల సేకరణ



పిట్లం మండలం రాంపూర్‌లో హౌస్ లిస్టింగ్ ప్రక్రియ చేపడుతున్న అధికారులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల సర్వేలో భాగంగా తొలి దశలో ఇంటింటికి వెళ్లి స్టిక్కర్లు అతికించడంతో పాటు ఇంటి యజమాని ఫోన్ నంబర్లు సేకరించారు. ఈ నెల 6, 7, 8 తేదీల్లో ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎన్యుమరేటర్లకు 150, పట్టణ ప్రాంతాల్లో 125 ఇళ్ల చొప్పున కేటాయించారు. దానికి అనుగుణంగా తమకు కేటాయించిన ఏరియాకు వెళ్లారు. పది మంది ఎన్యుమరేటర్లకు ఒక సూపర్‌వైజర్‌ను కేటాయించారు. ఎన్యుమరేటర్లు చేసిన హౌస్ లిస్టింగ్‌ను ఎప్పటికప్పుడు వీరు పరిశీలించారు. జిల్లాలో సర్వే కోసం 2,400 మంది ఎన్యుమరేటర్లు, 230 మంది సూపర్‌వైజర్లు విధుల్లో పాల్గొంటున్నారు. మూడు రోజుల్లో హౌస్ లిస్టింగ్ పూర్తి చేయాల్సి ఉండగా, అక్కడక్కడా కొంత మిగిలిపోయినట్లు తెలుస్తోంది. వాటిని కూడా పూర్తి చేయనున్నారు. ఇప్పటివరకు జిల్లాలో 2,97,300 కుటుంబాలు ఉన్నట్లు లెక్క తేలింది.

అందరి ఆధార్ నంబర్లు ఇవ్వాల్సిందే..

సర్వేలో కుటుంబ సభ్యుల ఆధార్ నంబర్లు, మొబైల్ నంబర్లు నమోదు చేసుకుంటారు. వైకల్యం ఉంటే వివరాలు, వైవాహిక స్థితి, చదువు, ప్రస్తుతం చేస్తున్న పని వివరాలు నమోదు చేస్తారు. వారి ఆదాయ వివరాలు సేకరిస్తారు. సర్వేలో భాగంగా ఇంటి యజమాని, కుటుంబ సభ్యులు భూములు కలిగి ఉన్నారా ఆరా తీస్తారు. భూమి ఉంటే ధరణి పాస్‌బుక్‌ల నంబరు నమోదు చేసుకుంటారు. అలాగే రిజర్వేషన్ విధానం నుంచి పొందిన ప్రయోజనాలు, ఐదేళ్లుగా లబ్ధి పొందిన పథకాల వివరాలు తెలుసుకుంటారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్‌కు చెందిన వారైతే కుల ధ్రువీకరణ పత్రం పొందారా, డీనోటీఫై చేయబడిన సంచార జాతులకు చెందిన వారా అన్న వివరాలు తీసుకుంటారు.

సమగ్ర సమాచారం

ఎన్యుమరేటర్లు ఇంటింటికీ వెళ్లి యజమాని పేరు నమోదు చేసుకుని ఇంటికి స్టిక్కర్ అతికించారు. స్టిక్కర్లు అతికించడం ద్వారా ఎన్ని కుటుంబాలు ఉన్నాయన్న లెక్క తేలింది. ఇక మిగిలింది సమగ్ర సమాచారం సేకరించడమే. సర్వే ప్రొఫార్మాలో 56 అంశాలకు సంబంధించి మొత్తం 75 ప్రశ్నలు ఉన్నాయి. ఇంటి యజమాని లేదా కుటుంబ సభ్యులను కలిసి ఆ సమాచారాన్ని తీసుకుని ఫామ్‌లో నింపాల్సి ఉంటుంది. కుటుంబ సభ్యులకు ఉన్న భూములు, ఇళ్లతో పాటు వారు తీసుకున్న అప్పులు, ప్రభుత్వం నుంచి పొందుతున్న లబ్ధి వంటి వివరాలు అందులో ఉన్నాయి. ఇదే సమయంలో కులం వివరాలు కూడా నమోదు చేస్తారు.



కామారెడ్డి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం మెట్లపై కూర్చున్న ప్రజలు

ఆదాయం ఉన్నా.. సౌకర్యాలు సున్నా

- కామారెడ్డి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద కనీస వసతులు కరువు
- మెట్లపై, చెట్ల కింద కూర్చుంటున్న ప్రజలు
- తాగునీరు, మూత్రశాలలు కరువు
- పట్టించుకోని అధికారులు



ఎండలో ఉన్న సిమెంట్ బెంచీలు

కామారెడ్డి టౌన్: ఆ శాఖకు ఆదాయం ఫుల్‌గా వస్తది. నిత్యం రూ.లక్షల్లో రాబడి ఖజానాలో జమవుతుంది. కానీ ఆ కార్యాలయంలో కనీస సౌకర్యాలు మాత్రం లేవు. ఆఫీస్‌కు వచ్చే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇదీ కామారెడ్డి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం దుస్థితి.. కామారెడ్డి పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీలో అద్దె భవనంలో కొనసాగే కామారెడ్డి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని రెండేళ్ల క్రితం జాతీయ రహదారి పక్కన పాత రాజంపేట గ్రామ పంచాయతీకి భవనంలోకి తరలించారు. నిత్యం ప్లాట్లు, ఇళ్లు, భూములు తదితర రిజిస్ట్రేషన్‌ల కోసం నిత్యం వందలాది మంది కార్యాలయానికి వస్తుంటారు. ప్రతీ నెల రూ.కోటి నుంచి రూ.కోటిన్నరకు పైగా ఆదాయం సమకూరుతుంది. కానీ అక్కడ కనీస సౌకర్యాలు కరువయ్యాయి. కూర్చోడానికి కుర్చీలు లేవు. దాతలు ఏర్పాటు చేసిన సిమెంట్ బెంచీలు ఓపెన్ స్థలం ఎండలో ఉన్నాయి. దీంతో అందులో ఎవరు కూర్చోవడం లేదు. దీంతో వివిధ పనుల కోసం వచ్చే వారు ఆఫీసు మెట్లపై, బయట చెట్ల కింద కూర్చుంటున్నారు. ఆఫీసులో మూత్రశాలలు లేవు. తాగునీటి సౌకర్యం కూడా కల్పించలేదు. పట్టణానికి దూరంగా ఉండటంతో అక్కడ కిరాణ, ఇతర దుకాణాలు సైతం అందుబాటులో లేవు. దీంతో తాగునీరు కూడా దొరకడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. రిజిస్ట్రేషన్‌ల కోసం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉండాల్సి వస్తోందని.. అధికారులు స్పందించి తాగునీరు, మూత్రశాలలు, కూర్చోడానికి సౌకర్యాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై సబ్‌రిజిస్ట్రార్ సాయికృష్ణను 'సాక్షి' వివరణ కోరగా సౌకర్యాలు కల్పిస్తామన్నారు.

ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకోవాలి



మాట్లాడుతున్న మానసిక వైద్యాధికారి రమణ

రామారెడ్డి: విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకోవాలని జిల్లా మానసిక వైద్య అధికారి రమణ అన్నారు. మానసిక ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా రామారెడ్డి మండలం ఉప్పల్‌వాయి గురుకుల బాలుర జూనియర్ కళాశాలలో శుక్రవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. యువత మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దన్నారు. ఆకర్షణ పేరుతో జీవితాలను నాశనం చేసుకొవద్దని సూచించారు. స్మార్ట్ ఫోన్లకు బానిసలు కావొద్దన్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురి కావొద్దని ముందు నుంచే ప్రణాళిక ప్రకారం చదువుకోవాలని సూచించారు. మానసికంగా ఎటువంటి సమస్యలు వచ్చినా దగ్గర్లోని మెడికల్ ఆఫీసర్‌ని లేదా సైకియాట్రిస్ట్‌ని సంప్రదించాలని సూచించారు. టోల్ ఫ్రీ నెంబర్ 14416 కి కాల్ చేసి కూడా కౌన్సెలింగ్ పొందవచ్చునని చెప్పారు. జిల్లా సోషల్ వర్కర్ రాహుల్ కుమార్, అధ్యాపకులు సురేందర్ రెడ్డి, హరిసింగ్, బాబు, సౌందర్య పాల్గొన్నారు.

మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి వరప్రసాద్



మాట్లాడుతున్న న్యాయమూర్తి వరప్రసాద్

కామారెడ్డి టౌన్: మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ వీఆర్ఆర్ వరప్రసాద్ అన్నారు. న్యాయ సలహా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం కామారెడ్డిలోని సాందీపని డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. న్యాయ సేవాధికార సంస్థ చట్టం 1987లో తీసుకువచ్చినప్పటికీ 1995 నుంచి ఆచరణలోకి వచ్చిందని అన్నారు. నూతనంగా వచ్చిన చట్టాలు, మార్పులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు. న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కల్పించడం, అర్హులకు ఉచిత న్యాయ సేవలను అందించడం చేస్తామన్నారు. న్యాయ సహాయం కోసం టోల్ ఫ్రీ 15100 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. విద్యార్థులు, యువత ఇంటర్‌నెట్‌ను సద్వినియోగం చేసుకుని జ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి నాగరాణి, సాందీపని విద్యా సంస్థల చైర్మన్ హరిస్మరణ్‌రెడ్డి, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మాయా సురేష్, డిప్యూటీ డిఫెన్స్ కౌన్సిల్ మోహన్‌రావు, డీఎల్ఎస్ఏ సూపరింటెండెంట్ చంద్రసేన్ రెడ్డి పాల్గొన్నారు.

'అమ్మ'కు అందని డబ్బు

- మూడేళ్లుగా విడుదల కాని ఎంసీహెచ్ నిధులు
- జిల్లాలో 88,893 మంది ఎదురుచూపులు

రామారెడ్డి: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచడం.. మాతాశిశు ఆరోగ్య సంరక్షణ కోసం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మదర్ అండ్ చైల్డ్ హెల్త్(ఎంసీహెచ్) పథకాన్ని నిధుల కొరత వేధిస్తుంది. ఈ పథకానికి సంబంధించి నిధులు విడుదల చేయకపోవడంతో లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వం కేసీఆర్ కిట్ పేరుతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవించిన వారికి ఆర్థిక సాయం చేస్తోంది. అమ్మాయి పుడితే రూ.13 వేలు, అబ్బాయి పుడితే రూ.12 వేలు మహిళల ఖాతాల్లో విడతల వారీగా జమ అయ్యేవి. అయితే గత మూడేళ్లుగా ఈ పథకానికి నిధులు విడుదల కావడం లేదు. దీంతో సర్కార్ ఆస్పత్రుల్లో ప్రసవించిన మహిళలు డబ్బుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం ఈ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఎంసీఏ కిట్‌గా పేరు మార్చింది. కానీ నిధులు మాత్రం విడుదల చేయడం లేదు. దీంతో లబ్ధిదారులు అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. కాగా పథకం ప్రవేశపెట్టిన మొదట్లో ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెలివరీలు పెరిగాయి. అయితే ఇటీవల ప్రసవాలు తగ్గినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం స్పందించి నిధులు విడుదల చేయాలని ప్రజలు కోరుతున్నారు. కాగా దీనిపై వివరణ కోరేందుకు డీఎంహెచ్‌వో చంద్రశేఖర్‌ను సాక్షి ఫోన్‌లో సంప్రదించగా స్పందించలేదు.

జిల్లాలో డబ్బులు అందాల్సిన మహిళల వివరాలు

సంవత్సరం	మహిళలు
2021-22	31,249
2022-23	32,492
2023-24	25,152

రెండేళ్ల నుంచి రాలేదు



నాకు రెండేళ్ల కింద సర్కార్ దవాఖానాలో ప్రసవం జరిగింది. కానీ ఇంతవరకు డబ్బులు రాలేవు. అప్పుడు రూ.13 వేలు వస్తాయన్నారు. ఇప్పుడు ఎవరిని అడగాలి.

– సరిత, మొండివీరన్నపల్లి తండా

డబ్బులు రావడం లేదు



మూడేళ్ల నుంచి ఎంసీహెచ్ డబ్బులు రావడం లేదు. లబ్ధిదారులు ఆస్పత్రికి వచ్చి డబ్బులు ఎప్పుడు వస్తాయని అడుగుతున్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే నేరుగా మహిళల ఖాతాల్లో జమ అవుతాయి.

– సురేశ్, రామారెడ్డి వైద్యాధికారి

మన బియ్యానికి మంచి పేరుంది

- ఆరబెట్టిన ధాన్యం తూకం వేయాలి
- పౌరసరఫరాల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ దేవేంద్రసింగ్ చౌహాన్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సెక్రెటరీ దేవేంద్రసింగ్ చౌహాన్



సదాశివనగర్‌లో ధాన్యం సేకరణను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ సెక్రెటరీ చౌహాన్, కలెక్టర్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: తెలంగాణ రాష్ట్రంలో పండించే బియ్యానికి మంచి పేరుందని పౌరసరఫరాల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ దేవేంద్ర సింగ్ చౌహాన్ అన్నారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌కు విచ్చేశారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం రైస్ మిల్లర్లు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గత సీజన్‌లలో చేపట్టిన మిల్లింగ్ (సీఎంఆర్) పనితీరును బట్టి మిల్లర్లకు ధాన్యం కేటాయిస్తామని పేర్కొన్నారు. మిల్లర్లు ఎలాంటి అపోహలు, అనుమానాలు పెట్టుకోవద్దన్నారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి, శుభ్రపరచిన తర్వాత కేంద్రాలను తీసుకు రావాలని సూచించారు. ప్రతి బస్తాకు 40.650 కిలోలుగా తూకం వేస్తారని, రైతులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రతి గ్రామంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. రైతుల వద్దకే ప్రభుత్వ యంత్రాంగం వస్తుందన్నారు. అధికారులు నిజాయితీగా పనిచేయడం ద్వారానే మంచి గుర్తింపు వస్తుందన్నారు.

51,480 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

జిల్లాలో 423 కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 51,480 మెట్రిక్ టన్నుల ధాన్యంను సేకరించినట్లు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, సన్న రకం వడ్లు కొనుగోలుకు అవసరమైన చోట ప్రత్యేకంగా కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. కొనుగోళ్లలో జిల్లా రాష్ట్రంలో రెండో స్థానంలో ఉందన్నారు. మిల్లర్లు బ్యాంక్ గ్యారంటీ పత్రాలను అందజేశారని తెలిపారు. గన్నీ బ్యాగుల కొరత లేదన్నారు. ధాన్యం రవాణాకు 10 కాంట్రాక్ట్ సంస్థలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. జిల్లాలో ఇంటర్ చెక్ పోస్టులు ఏర్పాటు చేసి, మహారాష్ట్ర, కర్నాటక నుంచి అక్రమ రవాణా అరికట్టేందుకు నిఘా పెట్టామని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్పీ సింధు శర్మ, అదనపు కలెక్టర్లు శ్రీనివాస్ రెడ్డి, వి విక్టర్, ఆర్డీవో రంగనాథ్‌రావు, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డీఎం రాజేందర్, ఇన్‌చార్జి డీఎస్‌వో నరసింహ రావు, సహకార అధికారి రామ్మోహన్, డీఏవో తిరుమల ప్రసాద్, డీఆర్‌డీవో సురేందర్, మార్కెటింగ్ అధికారి రమ్య పాల్గొన్నారు.

రైతుల సంక్షేమం కోసమే కేంద్రాలు

సదాశివనగర్/భిక్కనూరు: రైతుల సంక్షేమం కోసమే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని పౌరసరఫరాల ప్రిన్సిపల్ సెక్రెటరీ దేవేంద్ర సింగ్ చౌహాన్ అన్నారు. శుక్రవారం ఆయన సదాశివనగర్, భిక్కనూరు మండలం జంగంపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు ధాన్యాన్ని పొల్లు పూర్తిగా తీసిన తర్వాతనే తూకం చేస్తే బాగుంటుందన్నారు. కాంటాలు అయిన వెంటనే బిల్లులు చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్లు శ్రీనివాస్ రెడ్డి, విక్టర్, డీఏవో తిరుమల ప్రసాద్, ఆర్డీవో రంగనాథ్, డీసీవో నర్సింహరావు, డీఎం రాజేందర్, డీఆర్‌డీవో సురేందర్, మార్కెటింగ్ అధికారి రమ్య, తహసీల్దార్లు శివప్రసాద్, గంగాసాగర్, విండో చైర్మన్ కమలాకర్‌రావు, డీసీసీబీ డైరెక్టర్ గొండ్ల సిద్దరాములు తదితరులు పాల్గొన్నారు.

హౌస్ లిస్టింగ్ వేగవంతం చేయాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: ఒక్క ఇల్లు అయినా వదిలి పెట్టకుండా హౌస్ లిస్టింగ్ సర్వే పూర్తి చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం మండల ప్రత్యేక అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇంటింటి సమగ్ర సర్వేలో భాగంగా మొదటి దశలో చేపట్టిన హౌస్ లిస్టింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు సర్వేను పరిశీలించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న హౌస్ లిస్టింగ్ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆపై ఇంటింటి సమగ్ర సర్వే పనులు చేపట్టాలన్నారు. ప్రతి అంశం వారీగా సమాచారాన్ని బుక్ లెట్ ప్రకారం సేకరించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవోలు రంగనాథ్ రావు, ప్రభాకర్, మండల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

క్లుప్తంగా

నాస్ మాక్ టెస్ట్–3



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో శుక్రవారం నాస్ మాక్ టెస్టు–3 నిర్వహించినట్లు మండల విద్యాధికారి షౌకత్ అలీ తెలిపారు. నాస్ పరీక్షలు గతంలో రెండు సార్లు నిర్వహించగా మూడో టెస్టు శుక్రవారం నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. ఫైనల్ నాస్ పరీక్షల డిసెంబర్ 4న ఉంటుందన్నారు. ప్రతి పాఠశాలలో 3, 6, 9 తరగతులకు పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందరగా ఆయన మండలంలోని పలు పాఠశాలలో నిర్వహిస్తున్న నాస్ టెస్టు పరీక్షలను పరిశీలించారు. ఆయన వెంట గంగాధర్, వహీద్ సిద్దిఖీ, సిబ్బంది ఉన్నారు.

ఫిజియోథెరపి క్యాంపు



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని భవిత సెంటర్‌లో శుక్రవారం దివ్యాంగులకు ఫిజియోథెరపి నిపుణుడు సాయికిరణ్‌గౌడ్ ఫిజియోథెరపి చేశారు. ఈ సందర్భంగా పలువురు దివ్యాంగులకు వ్యాయామం చేయించారు. ప్రతి రోజు ఇంటి వద్ద విద్యార్థుల తల్లి దండ్రులు దివ్యాంగుల చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ చూపి వ్యాయామం చేయించాలన్నారు. ఉపాధ్యాయుడు మణికంఠ, ఐఈఆర్‌పీ అశ్విని, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పిట్లంలో..



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని భవిత సెంటర్‌లో శుక్రవారం దివ్యాంగ విద్యార్థుల కోసం ఎంఈవో దేవిసింగ్ ఆధ్వర్యంలో ఫిజియోథెరపి క్యాంప్ ఏర్పాటు చేశారు. ఫిజియోథెరపిస్ట్ వి.సారిక 8 మంది విద్యార్థులకు ఫిజియోథెరపి పరీక్షలు నిర్వహించారు. ఉపాధ్యాయులు కమల్ కిషోర్, గంగాధర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో పాము కలకలం



పిట్లం: మండలంలోని కంబాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కట్ల పాము కలకలం సృష్టించింది. శుక్రవారం ఉదయం తరగతి గదిలో పాము కనిపించడంతో విద్యార్థులు కేకలు వేస్తూ బయటకు వచ్చారు. దీంతో అప్రమత్తమైన పాఠశాల సిబ్బంది స్థానికుల సాయంతో పామును చంపేశారు. పాఠశాలకు ప్రహరీ లేక పోవడంతోనే విషపురుగులు పాఠశాలలోకి వస్తున్నాయని, సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి ప్రహరీ నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉత్సాహంగా వాలీబాల్ టోర్నీ



నిజామాబాద్‌నాగారం: నగరంలోని పాత కలెక్టరేట్ మైదానంలో క్రీడల కార్యదర్శి నాగమణి ఆధ్వర్యంలో శుక్రవారం ఎస్‌జీఎఫ్ అండర్–14 బాల బాలికల వాలీబాల్ టోర్నీ నిర్వహించారు. టోర్నీలో గెలుపొందిన విజేత జట్లను డీఈవో అశోక్ అభినందించారు. బాలుర విభాగంలో ఆర్మూర్ మొదటి స్థానం, కమ్మర్‌పల్లి ద్వితీయ స్థానం సాధించాయి. బాలికల విభాగంలో ఆర్మూర్ మొదటిస్థానం, ధర్పల్లి ద్వితీయ స్థానం సాధించాయి. కార్యక్రమంలో పెటా సంఘం అధ్యక్షుడు గోపిరెడ్డి, డీసీఈబీ సెక్రటరీ సీతయ్య, పీడీలు అబ్బపూర్ రవి, పవన్‌కుమార్, ఇందిర, రాజేశ్వర్, శ్రీనివాస్, రమణ, సురేందర్, గంగామోహన్, కవిత, స్వామి, కిరణ్, అనిల్ పాల్గొన్నారు.

వేంపల్లి పాఠశాలకు సార్లొచ్చారు..!

- నలుగురి ఉపాధ్యాయుల కేటాయింపుతో తీరిన సమస్య
- గ్రామం నుంచి మరో ఆరుగురు వీవీలు
- విజయవంతంగా సాగుతున్న పాఠశాల



ప్రార్థనలో విద్యార్థులు, ఉపాధ్యాయులు



రేకుల షెడ్డుతో ఉన్న పాఠశాల భవనం

బాల్కొండ: ముప్కాల్ మండలం వేంపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు నలుగురు ఉపాధ్యాయులను ప్రభుత్వం కేటాయించింది. దీంతో పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత తీరింది. గత పదేళ్ల క్రితం గ్రామస్తులు తమ పిల్లలను ప్రయివేటు పాఠశాలలకు పంపమని తీర్మానం చేశారు. నాటి నుంచి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో కళకళ లాడుతోంది. ప్రస్తుతం పాఠశాలలో ప్రీ ప్రైమరీ పాఠశాలలో 80 మంది, ప్రైమరీ పాఠశాలలో 167 మంది విద్యార్థులు మొత్తం 247 మంది విద్యార్థులు చదుతున్నారు. డీఎస్సీకి ముందు పాఠశాలలో ఇద్దరు రెగ్యులర్ ఉపాధ్యాయులు, ఇద్దరు డిప్యుటేషన్‌పై ఉన్నారు. కానీ డీఎస్సీలో ఉపాధ్యాయుల నియామకంతో ప్రభుత్వం ఈ పాఠశాలకు నలుగురు ఉపాధ్యాయులను కేటాయించింది. దీంతో ఉపాధ్యాయుల సంఖ్య 8కి చేరింది. కానీ డిప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న ఇద్దరిని రిలీవ్ చేసింది. ప్రస్తుతం ఆరుగురు ప్రభుత్వ ఉపాధ్యాయులు పాఠశాలలో పని చేస్తున్నారు.

ఆరుగురు వీవీలు..

గత పదేళ్ల నుంచి ప్రాథమిక పాఠశాలలో ప్రీప్రైమరీ(ఎల్‌కేజీ, యూకేజీ)లను నిర్వహిస్తున్నారు. పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయులే కాకుండా గ్రామస్తులు వేతనాలు చెల్లించుకుంటు ఆరుగురు విద్యావలంటీర్లను నియమించుకున్నారు. పాఠశాలలో ప్రస్తుతం ఆరుగురు ప్రభుత్వ ఉపాధ్యాయులతో పాటు ఆరుగురు విద్యావలంటీర్లతో కలిపి 12 మంది విద్యా బోధన చేస్తున్నారు. పాఠశాలలో 30 మంది విద్యార్థులకు ఒక సెక్షన్ ఏర్పాటు చేసి పాఠాలు బోధిస్తున్నారు.

తరగతి గదుల కొరత

కొత్త డీఎస్సీతో కొంత మేర ఉపాధ్యాయుల కొరత తీరింది. కానీ పాఠశాలలో తరగతి గదుల కొరత మాత్రం వేధిస్తూనే ఉంది. గ్రామస్తులు స్వయంగా డబ్బులు పోగు చేసుకుని గదులకు మరమ్మతులు చేపట్టినా రేకుల షెడ్డుతో నిర్మించిన భవనం కావడంతో తరచూ లీకేజీలు ఏర్పడుతున్నాయి. తరగతి గదుల కొరత ఉండటంతో వరండాలో, చెట్ల కింద చదువులు కొనసాగుతున్నాయి. సెక్షన్లు ఉండటంతో ఎక్కువ గదులు అవసరమవుతోంది. ప్రభుత్వం స్పందించి నూతన భవన నిర్మాణానికి నిధులు కేటాయిస్తే గ్రామంలో మూడు ఎకరాల భూమిని పాఠశాల కోసం ఇవ్వడానికి గ్రామస్తులు సిద్ధంగా ఉన్నారు. ప్రభుత్వం స్పందించి పూర్తి స్థాయి వసతులతో నూతన భవనం నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

భూమివ్వడానికి సిద్ధంగా ఉన్నాం



ప్రభుత్వం స్పందించి అన్ని వసతులతో నూతన పాఠశాల భవనం నిర్మిస్తే గ్రామంలో మూడెకరల స్థలం ఇవ్వడానికి గ్రామస్తులం సిద్ధంగా ఉన్నాం. తరగతి గదులు లేక ఇబ్బందిగా ఉంది. పాలకులు స్పందించి పాఠశాలను గుర్తించాలి.

– రామకృష్ణ, పాఠశాల కమిటీ చైర్మన్, వేంపల్లి

గ్రామస్తుల సహకారంతోనే..



గ్రామస్తుల సహకారంతోనే గత పదేళ్లుగా పాఠశాల విజయవంతంగా సాగుతోంది. నలుగురు ఉపాధ్యాయులను ప్రభుత్వం కేటాయించింది. ప్రీ ప్రైమరీ కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. తరగతి గదుల కొరత తీర్చాల్సిన అవసరం ఉంది.

– శైవ శ్రీనివాస్, హెచ్‌ఎం, వేంపల్లి

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

డీఎల్‌పీవో శ్రీనివాస్



రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో శ్రీనివాస్

దోమకొండ: కుల గణనసర్వేను ఎన్యుమరేటర్లు పకడ్బందీగా నిర్వహించాలని డీఎల్‌పీవో శ్రీనివాస్ సూచించారు. గురువారం దోమకొండ మండల కేంద్రంలో సర్వేను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. సర్వేలో ఎలాంటి పొరపాట్లు లేకుండా వివరాలు సేకరించాలన్నారు. ఎలాంటి తప్పులు రాయకుండా చూడాలని, కుటుంబాల వివరాలు పక్కాగా సేకరించాలన్నారు. ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఈవో యాదగిరి సిబ్బంది ఉన్నారు.

పంచాయతీ రికార్డుల పరిశీలన

దోమకొండలో పంచాయతీ రికార్డులను డీఎల్‌పీవో పరిశీలించారు. మండల కేంద్రంలో కొంత కాలంగా ఎలాంటి ఆన్‌లైన్ పర్మిషన్ లేకుండా ఇళ్ల నిర్మాణాలు జరిగినట్లు ఫిర్యాదులు రాగా వాటి వివరాలను ఆయన పంచాయతీ కార్యదర్శి యాదగిరిని అడిగి తెలుసుకున్నారు. గతంలో ఇక్కడ ఈవోగా పనిచేసి బదిలీపై వెళ్లిన ఈవో పలు ఇళ్లకు పర్మిషన్ ఇచ్చారని, కనీసం రోడ్డుకు 50 ఫీట్ల దూరం కూడా పాటించకుండా డబ్బులు తీసుకుని పర్మిషన్ ఇచ్చినట్లు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదులు రాగా, ఆయన రికార్డులు పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ విషయంపై డీఎల్‌పీవోను ప్రశ్నించగా.. వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు.

ఇంటింటి సర్వేకు సహకరించాలి



శాబ్దిపూర్‌లో స్టిక్కర్లను అతికిస్తున్న ఎన్యుమరేటర్లు



కుల గణన సర్వేలో పాల్గొన్న ఎంపీవో మలహరి

కామారెడ్డి రూరల్: ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీవో హెప్సిబారాణి కోరారు. శుక్రవారం శాబ్దిపూర్‌లో సర్వే తీరును ఆమె పరిశీలించారు. ఆయా ఇళ్లను సందర్శించి కుటుంబ సర్వే నిర్వహణ కోసం అతికించిన స్టిక్కర్లను, వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. 6 నుంచి 8 వరకు హౌజ్ లిస్టింగ్ ప్రక్రియ జరిగిందని, 9న సమగ్ర కుటుంబ వివరాల సేకరణ ప్రారంభమవుతుందన్నారు.

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని 41 గ్రామ పంచాయతీల్లో శుక్రవారం సర్వే నిర్వహించినట్లు ఎంపీవో మలహరి తెలిపారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి కుటుంబాలను గుర్తించి స్టిక్కర్లు అతికిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో ఎన్యుమరేటర్లు శుక్రవారం సర్వే నిర్వహించారు. పట్టణంలోని ఇంటింటికి ఎన్యుమరేటర్లు కుటుంబాలను గుర్తించి స్టిక్కర్లు అతికించారు.

చలికాలంలో ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



మద్నూర్‌లో శిబిరం నిర్వహిస్తున్న వైద్యులు



విద్యార్థులకు టీకాలు వేస్తున్న సిబ్బంది

మద్నూర్(జుక్కల్): విద్యార్థులు చలికాలంలో ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని డోంగ్లీ పీహెచ్‌సీ వైద్యుడు బస్వరాజు సూచించారు. మండల కేంద్రంలోని బాలుర గురుకుల పాఠశాలలో శుక్రవారం వైద్య ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. డోంగ్లీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్యులు గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు గల ఆరోగ్య సమస్యలను గుర్తించి తగిన మందులు అందించారు. చలికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యులు సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో ప్రిన్స్‌పాల్ గంగాకిశోర్, ఏటీపీ సుమన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

కామారెడ్డి టౌన్: లయన్స్ క్లబ్ ఆఫ్ వివేకానంద ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేసినట్లు క్లబ్ అధ్యక్షుడు మారుతి తెలిపారు. శిబిరంలో పాల్గొన్న వైద్యులను మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ సన్మానించారు. ప్రతినిధులు కృష్ణహరి, సంతోష్, భూపేష్ తదితరులు పాల్గొన్నారు.

అడివిలింగాల జెడ్పీ పాఠశాలలో..

ఎల్లారెడ్డిరూరల్: అడివిలింగాల జెడ్పీ పాఠశాలలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. పాఠశాలలోని విద్యార్థులకు, ఉపాధ్యాయులకు మత్తమాల ఆరోగ్య సిబ్బంది డీటీ వ్యాక్సిన్లు వేశారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు శివనర్సింహారావు తదితరులున్నారు.



వైద్యులను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ

జాతీయ స్థాయి యోగా పోటీలకు జిల్లా విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో రాజు

కామారెడ్డి టౌన్/రామారెడ్డి: వరంగల్ జిల్లాలో ఈ నెల 6, 7 తేదీలలో జరిగిన రాష్ట్ర స్థాయి యోగా పోటీలలో మాచారెడ్డి మండల కేజీబీవీ విద్యార్థినీలు సరస్వతి, విజ్ఞానేశ్వరి, రెడ్డిపేట జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి సందీప్‌లు తమ ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి హీరాలాల్ తెలిపారు. త్వరలో మహారాష్ట్రలో జరిగే జాతీయ స్థాయి పోటీలలో వారు పాల్గొంటారని తెలిపారు. ఈ మేరకు విద్యార్థులను శుక్రవారం డీఈవో ఎస్. రాజు కలెక్టరేట్ కార్యాలయంలో అభినందించారు. ఉపాధ్యాయులు సుకన్య, గౌమతి, టి.రాజు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

కామారెడ్డి టౌన్: భువనగిరి జిల్లాలో నేడు జరిగే రాష్ట్ర స్థాయి అండర్ –14 కబడ్డీ పోటీలకు జిల్లా కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి దినేష్ ఎంపికైనట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి హీరాలాల్, హెచ్‌ఎం నరహరి రాజు శుక్రవారం తెలిపారు. ఈ మేరకు దినేష్‌కు ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

గుజరాత్‌కు గడికోట అర్చరీ క్రీడాకారులు



దోమకొండ: గుజరాత్‌లో జరిగే ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి అర్చరీ పోటీల్లో పాల్గొనేందుకు దోమకొండ గడికోట క్రీడాకారులు(అండర్–17 విభాగం) అనుదీప్, ప్రీతి, ఇందు శనివారం తరలివెళ్లినట్లు కోచ్ ప్రతాప్ దాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరంగల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు మంచి ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. క్రీడాకారులను సన్మానించారు. వీరికి అర్చరీ అసోసియేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు అనిల్ కామినేని, జిల్లా అధ్యక్షుడు తిర్మల్ గౌడ్, జిల్లా సెక్రటరీ మోహన్ రెడ్డి, మండల నాయకులు, అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

హాకీ పోటీలకు గర్గుల్ క్రీడాకారులు

కామారెడ్డి రూరల్: 68వ రాష్ట్రస్థాయి అండర్ –17 బాలికల హాకీ టోర్నమెంట్‌కు గర్గుల్ జెడ్పీహెచ్‌ఎస్ క్రీడాకారులు రాణబోయిన ప్రవళిక, కమ్మరి భవానీలు ఎంపికై నట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ నోముల మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు 11 నుంచి 13 వరకు నిజామాబాద్‌లోని నవ్యభారతి గ్లోబల్ హైస్కూల్‌లో జరిగే హాకీ టోర్నమెంట్‌లో పాల్గొంటారని పేర్కొన్నారు.

డైమండ్ జూబ్లీ వారోత్సవాలకు మాచారెడ్డి విద్యార్థులు

మాచారెడ్డి: సోమారంపేట, ఘన్‌పూర్ ఉన్నత పాఠశాలల స్కౌట్స్ గైడ్స్ విద్యార్థులు ఈ నెల 9, 10, 11 వ తేదీలలో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ డైమండ్ జూబ్లీ వారోత్సవాలకు 9 మంది చొప్పున ఎంపికయ్యారని రాష్ట్ర కార్యదర్శి అరుణ్ కుమార్,జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డి జిల్లా ట్రైనింగ్ కమిషనర్ స్కౌట్స్ గైడ్స్ గోపాలకృష్ణ, సంధ్య జిల్లా ఎస్కార్ట్‌గా ఉంటారని వివరించారు.

క్రైం కార్నర్

బైక్ టైర్ పేలి ఒక్కరి మృతి



స్వామిగౌడ్ (ఫైల్)

భిక్కనూరు: మండలంలోని అంతంపల్లి శివారులోని జాతీయ రహదారిపై టైరు పేలడంతో బైక్ నడుపుతున్న వ్యక్తి మృతి చెందాడు. దోమకొండ మండలం ముత్యం పేటకు చెందిన కొడిప్యాక స్వామిగౌడ్ (44) భిక్కనూరు మండలంలోని తిప్పాపూర్ కల్లుడిపోలో కార్మికునిగా పనిచేస్తాడు. శుక్రవారం ముత్యపేటకు వెళ్లేందుకు తిప్పాపూర్ గ్రామం నుంచి బైక్ పై వెళ్తుండగా అంతంపల్లి గ్రామ శివారులో జాతీయ రహదారిపై బైక్ వెనుక టైర్ పేలింది. బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న రేలింగ్‌ను ఢీకొంది. స్వామిగౌడ్ కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై సాయికుమార్ వివరించారు.

బిర్యానీ కోసం వెళ్లి యువకుడు..

నిజామాబాద్ రూరల్: బిర్యానీ తిందామని బైక్‌పై వెళ్తున్న ఓ యువకుడిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందినట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో ఆరిఫ్ శుక్రవారం పేర్కొన్నారు. ఎస్‌హెచ్‌వో తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని ఒకటో డివిజన్ ఖానాపూర్‌లోని వీరభద్రకాలనీకి చెందిన భీమేశ్(27) అనే యువకుడు గురువారం రాత్రి బిర్యానీ తిందామని సారంగపూర్ నుంచి తన బైక్‌పై వెళ్తుండగా గుండారం సమీపంలోని పెట్రోల్ బంక్ సమీపంలో అతన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొన్నది. ఈ ఘటనలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

అప్పుల బాధతో ఆత్మహత్య



ప్రసాద్‌రావు(ఫైల్)

మోపాల్: అప్పుల బాధతో ఒకరు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మోపాల్ మండలంలోని న్యాల్‌కల్‌లో చోటు చేసుకుంది. ఎస్‌హెచ్‌వో చుక్క యాదగిరిగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. న్యాల్‌కల్ గ్రామానికి చెందిన కాలూరి ప్రసాద్‌రావు(42) వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. కొంత కాలంగా మద్యానికి బానిసై అప్పుల పాలయ్యాడు. గురువారం గ్రామ శివారులోని తన వ్యవసాయ షెడ్‌లో ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అక్కడే పని చేస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ రాజు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చాడు. చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించగా అర్ధరాత్రి పరిస్థితి విషమించి మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. భార్య రుచిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

హత్య చేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరణకు యత్నం



లక్ష్మణ్ మృతదేహం

ఖలీల్‌వాడి: నగరంలోని దుబ్బ ప్రాంతంలో ఉన్న ఓ వైన్స్ దుకాణం ఎదుట ఒకరిని హత్య చేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించినట్లు మూడో టౌన్ ఎస్సై మహేశ్ తెలిపారు. ఎస్సై శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా మద్నూర్‌కు చెందిన లక్ష్మణ్(28) అనే యువకుడు దుబ్బ ప్రాంతంలోని కాలూర్ చౌరస్తాలో ఉన్న వైన్స్ దుకాణం ఎదుట పడి ఉన్నట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా లక్ష్మణ్ చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు. పట్టణ సీఐ శ్రీనివాస్‌రాజు, ఎస్సై మహేశ్ డాగ్ స్క్వాడ్‌తో కలిసి హత్య జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. లక్ష్మణ్ తలపై ఉన్న గాయాల ఆధారంగా కొందరు అతన్ని తీవ్రంగా గాయపర్చి హత్య చేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు యత్నించినట్లు పోలీసులు గుర్తించారు. వైన్స్‌తో పాటు దుబ్బ ప్రాంతంలోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. కేసును ఛేదించేందుకు పోలీసులు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు.

పోక్సో కేసులో ముగ్గురి రిమాండ్

- ఇద్దరు ఉపాధ్యాయులు, ఓ మాజీ ప్రజాప్రతినిధి అరెస్టు!

భిక్కనూరు: పోక్సో కేసులో ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఓ మాజీ ప్రజాప్రతినిధిని భిక్కనూరు పోలీసులు అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు సమాచారం. మండలంలోని ఓ గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థినిపై ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు అసభ్యకరంగా ప్రవర్తించినట్లు ఇటీవల భిక్కనూరు పోలీసులకు ఫిర్యాదు అందింది. విచారణ అధికారిగా ఎల్లారెడ్డి డీఎస్పీని ఉన్నతాధి కారులు నియమించారు.

విచారణ అనంతరం నిందితుడితో పాటు ఘటన గురించి ఉన్నతాధికారులకు సమాచారం అందించలేదని సదరు పాఠశాల హెచ్‌ఎంను,అదే గ్రామానికి చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సమాచారం. ఎల్లారెడ్డి డీఎస్పీ విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదికను అందజేశారు.

బైక్‌చోరీలో మరో నిందితుడికి..

పెద్దకొడప్‌గల్: బైక్‌లను చోరీ చేసి విక్రయించేందుకు మహారాష్ట్రకు తీసుకెళ్తున్న నిందితుడిని పట్టుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు బిచ్కుంద సీఐ నరేశ్ శుక్రవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దకొడప్‌గల్ మండలంలోని బేగంపూర్ తండాకు చెందిన చౌహాన్ సుభాష్ అనే వ్యక్తి జల్సాలకు అలవాటుపడి కొన్ని రోజులుగా పెద్దకొడప్‌గల్, పిట్లం, ఎల్లారెడ్డి పరిధిలో గల మూడు బైక్‌లను చోరీ చేశాడు. వీటిని అంజని గ్రామ శివారులో దాచి మహారాష్ట్రలో విక్రయించేందుకు తీసుకెళ్తున్నట్లు సమాచారం అందడంతో నిందితుడిని పట్టుకున్నట్లు పేర్కొన్నారు. మూడు బైక్‌లను స్వాధీనం చేసుకొని నిందితుడిని కోర్టులో హాజరుపర్చి జడ్జి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సై మహేందర్, సిబ్బంది రవి, రమేశ్, సాయిశివ, శ్రీను పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న బైక్

- ఇద్దరికి తీవ్రగాయాలు



నిజాంసాగర్: ఆగి ఉన్న లారీని వెనుక నుంచి బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలైన ఘటన నిజాంసాగర్ మండల కేంద్రంలోని మంజీరా నది వంతెనపై గురువారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ బేగరి రాజు, లింగాగౌడ్ బైక్‌పై పని నిమిత్తం పిట్లంకు వెళ్లి తిరిగి వస్తుండగా మంజీరా నది వంతెనపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొన్నారు. ఈ ఘటనలో వీరికి తీవ్రగాయాలు కావడంతో కుటుంబీకులు మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. ప్రస్తుతం వీరి కోలుకుంటున్నట్లు కుటుంబీకులు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి రెండు రోజుల జైలు

బోధన్‌టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ ఒకరికి రెండు రోజుల జైలు శిక్షతో పాటు రూ. 500 జరిమానాను సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ శేష తల్ప సాయి విధించినట్లు పట్టణ సీఐ వెంకట నారాయణ శుక్రవారం తెలిపారు. పట్టణంలో నిర్వహించిన వాహనాల తనిఖీలో మద్యం సేవించి వాహనం నడుపుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని జడ్జి ఎదుట హాజరు పర్చినట్లు తెలిపారు. నేరం రుజువు కావడంతో శిక్ష విధించారన్నారు.

రెచ్చిపోతున్న దొంగలు



కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలో దొంగలు రెచ్చిపోతున్నారు. ఇళ్ల ముందర వాహనాలు ఉంచితే చోరీలకు పాల్పడుతున్నారు. ఇలాంటి ఘటన జిల్లా కేంద్రంలోని విద్యానగర్ కాలనీలో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. కాలనీలో ఓ వ్యక్తి తాను అద్దెకు ఉండే ఇంటి ఎదుట రాత్రి బైక్‌ను పార్క్ చేసి పడుకున్నాడు. ఉదయం లేచి చూసేసరికి బైక్ టైర్, బ్యాటరీలను దుండగులు దొంగిలించారు. పక్కనే ఉన్న మరో బైక్ బ్యాటరీ కూడా చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తామని అన్నారు.

యువకుడి ఆచూకీ లభ్యం



సత్యసాయి

ఎడపల్లి: మండలంలోని జైతాపూర్‌కు చెందిన సత్య సాయి అనే యువకుడు ఈ నెల 2న అదృశ్యమయ్యాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. అతను చిత్తూరు జిల్లాలో ఉన్నట్లు గుర్తించారు. స్థానిక ఎస్సై వంశీకృష్ణ రెడ్డి చిత్తూరు పోలీసులతో మాట్లాడి యువకుడిని బంధువులకు అప్పగించేలా కృషి చేశారు. తమ కుమారుడి ఆచూకీ లభించేలా కృషి చేసిన సీపీతో పాటు ఎస్సై వంశీకృష్ణకు యువకుడి తండ్రి వెంకటేశ్వరావు కృతజ్ఞతలు తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యంతో అధికారులు, పోలీసులు

వేల్పూర్: మండల కేంద్రంలోని వజ్ర రైస్ మిల్లులో భారీగా పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు వేల్పూర్ ఎస్సై నాగ్‌నాథ్ శుక్రవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గురువారం అర్ధరాత్రి అందిన సమాచారం మేరకు వజ్ర రైసుమిల్లుపై దాడిచేయగా అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యం పట్టుబడిందన్నారు. సివిల్ సప్‌లై అధికారులకు సమాచారం అందించగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బియ్యం లెక్కించారన్నారు. మూడు లారీల బియ్యం లెక్కింపు జరిగిందని, రైస్‌మిల్లు డబ్బాలలో నిల్వ ఉన్న బియ్యం మరో రెండు లారీల వరకు లభించే అవకాశం ఉందన్నారు. శనివారం మధ్యాహ్నం వరకు బియ్యం లెక్కింపు పూర్తయ్యే అవకాశం ఉందని ఎస్సై తెలిపారు. బియ్యం పూర్తిగా లెక్కింపు పూర్తయిన తర్వాత పూర్తి వివరాలతో కేసు నమోదు చేస్తామని ఎస్సై పేర్కొన్నారు.